షరామామూలే..!

- సిరిపురంలో యథావిధిగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెలకిచ్చుకుంటున్న ఆక్రమణదారులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు





సిరిపురంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న ఫుడ్ కోర్టులు, వాటి ముందు నిలిపిన వాహనాలు



ఫుట్‌పాత్ ఖాళీ లేకపోవడంతో రోడ్డుపై నడిచి వెళ్తున్న పాదచారులు

బీచ్‌రోడ్డు: నగరం నడిబొడ్డున కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. పాదచారుల సౌలభ్యానికి ఏర్పాటు చేసిన కాలిబాటలను కొంత మంది ధనార్జన కోసం ఆక్రమించి ఫుడ్ కోర్టులు నిర్వహించుకుంటున్నారు. పాదచారులు నడవడానికి.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా.. ఆక్రమణదారులను కట్టడి చేయడంలో జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు. దీంతో ఎవరికి వారే ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుంటూ పోతున్నారు. ఈ సమస్యకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఒకటి రెండు రోజుల అధికారుల హడావుడి ముగిశాక.. షరామామూలు గానే ఫుట్‌పాత్‌లపై ఫుడ్ కోర్టులు పెట్టుకుంటున్నారు.

సర్కిల్ చుట్టూ ఆక్రమణలే..

సిరిపురంలోని వీఎంఆర్డీఏ కార్యాలయం సర్కిల్ చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌లను కొంత మంది ఆక్రమించుకుని ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ రోడ్డుపై వాహనాలు నిలిపివేయడం వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. వాకింగ్ కోసం బీచ్‌కు వెళ్లే పాదచారులు నడిచేందుకు ఫుడ్‌పాత్‌లు కూడా లేకపోవడంతో వారంతా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వేల రూపాయల అద్దెకు..

సాధారణంగా పొట్టకూటి కోసం రోడ్డుపై చిన్న షాపులు పెట్టుకుంటారు. ఇక్కడ ఒక మాఫియాలా తయారై ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసి వేరే వాళ్లకు వేల రూపాయలకు అద్దెలకు ఇస్తున్నారు. రూ.వేలల్లో చెల్లించి ఇతర రాష్ట్రాల నుంచి పనివాళ్లను తీసుకొచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. ఇది కేవలం పొట్ట కూటి కోసం కాకుండా ధనార్జనే ధ్యేయంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

నగరంలోని ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వివిధ రకాల దుకాణాలు పెట్టి అద్దెలకు ఇస్తున్నా.. జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెండు మూడు రోజులు హడావుడి చేసే అధికారులు.. యథావిధిగా షాపులు ఏర్పాటు చేసుకునేందుకు మళ్లీ వారే సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



రోడ్డుపై పార్క్‌చేసిన వాహనాలు

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

రామ్‌నగర్ నుంచి పెదవాల్తేరు వైపు వెళ్లే మార్గం, రామ్‌నగర్ నుంచి బీచ్‌కు వెళ్లే మార్గం ఎప్పుడు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అటువంటి ప్రాంతాల్లోని కమర్షియల్ షాపులకు వచ్చే సందర్శకులు రోడ్డుపై వాహనాలు పార్క్‌చేయడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. ఈ సమస్యకు తోడు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయటం వల్ల రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరుగుతోంది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని, రాంగ్ పార్కింగ్‌ను నిరోధించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఆరిలోవ: ఆరిలోవ కనకదుర్గానగర్‌కు చెందిన విఘ్నేశ్వర అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో శ్రీకాంత్‌నగర్ ఆంజేయ స్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ నెల 27 వరకు ఇక్కడ ఉచితంగా అన్నదానం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు 200 మంది అయ్యప్ప మాలధారులకు అన్న వితరణకు ఏర్పాట్లు చేస్తున్నామని, స్థానిక స్వాములు పాల్గొనాలని కోరారు.

కాలువ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు జైభీం నగర్‌లో కాలువ నిర్మాణం పనులు శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ ప్రధాన కాలువ కొన్నాళ్లుగా పూర్తిగా మరమ్మతులకు గురైంది. దీని వల్ల కాలనీల్లోని వీధుల కాలువల నుంచి వచ్చే మురుగు నీరు దీని ద్వారా కిందకు వెళ్లే మార్గం సైతం మూసుకుపోయింది. దీంతో ఇక్కడ కల్వర్టును పూర్తిగా తొలగించి దానిని ఎత్తు చేసి కాలువ నిర్మిస్తున్నారు. ఈ పనులను కార్పొరేటర్ కెల్ల సునీత పరిశీలించారు. వేగంగా పనులు జరిపించాలని జీవీఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు.

విజిలెన్స్ వారోత్సవాల ర్యాలీ



విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

విశాఖ సిటీ: విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కొల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విద్యార్థులతో కలిసి ఎంవీపీ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ' అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 3 వరకు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



రోగితో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద, వైద్య సిబ్బంది

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఒక పేద మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేశారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ జీత్ రే ఆధ్వర్యంలో వైద్యులు చికిత్స చేయడంతో రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన 42 ఏళ్ల పి.లక్ష్మి అనే మహిళ తలనొప్పి, వాంతులతో బాధపడుతూ గత నెల 14న కేజీహెచ్ న్యూరో ఓపీలో చూపించుకుంది. ప్రాథమిక పరీక్షలు చేయడంతో ట్యూమర్ ఉన్నట్లు తేలింది. గతంలో కూడా ఈమెకు ఇదే సమస్య రావడంతో 2021లో కేజీహెచ్‌లో ఆపరేషన్ చేశారు. ఈ ట్యూమర్ ఇప్పుడు పెద్దదై బ్రెయిన్‌లో 3వ వంతు పెరిగింది. ఇది క్యాన్సర్ కాదని, బ్రెయిన్ ట్యూమర్ అని వైద్యులు వివరించారు. డాక్టర్ ప్రేమ జీత్ రే ఆధ్వర్యంలో ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి పర్యవేక్షణలో 8 గంటల పాటు శస్త్రచికిత్స చేసి పూర్తిగా ట్యూమర్‌ను తొలగించారు. శుక్రవారం రోగిని సూపరింటెండెంట్ శివానంద పరామర్శించారు.

ఏయూలో రాష్ట్ర అవతరణ దినోత్సవం



తెలుగుతల్లి చిత్రపటం వద్ద ఏయూ ఆచార్యులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, సమైక్య భారతి, పశ్చిమ బెంగాల్ తెలుగు భాష ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏయూ తెలుగు విభాగంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిత్తశుద్ధి, దేశభక్తి, గుండె ధైర్యం ప్రపంచ స్థాయిలో గొప్ప చరిత్రగా నిలిచిపోయిందన్నారు. పోరాడే హక్కు ప్రతి ఒక్కరిదని తెలియజేసిన గొప్ప ఉద్యమం ఆంధ్ర రాష్ట్ర ఉద్యమమని పేర్కొన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం తెలుగు ప్రజల్లో ఉద్యమానికి ఊపిరి పోసిందన్నారు. సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాలు, విద్యార్థి దశ నుంచే భాషా ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య పేటేటి ప్రేమానందం, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య బెన్ని, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో ఏక్తా దివస్



జాతీయ ఐక్యతా దినోత్సవం గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని ఆయన కొనియాడారు. చరిత్ర అధ్యాపకులు వి.సూర్యనారాయణ, పి.గోపాల్‌నాయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. దేశ సమగ్రత, పరిరక్షణకు కృషి చేస్తామని అధ్యాపకులు, విద్యార్థులతో జాతీయ సేవా పథకం అధికారి పి.ఉమామహేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, కె.రవిబాబు, డి శ్రావణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, ఎస్.వి.రామారావు, ఎం.బాలకృష్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కిడ్నాప్ నాటిక



కిడ్నాప్ నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతి నెలా మొదటి శుక్రవారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కిడ్నాప్ సాంఘిక నాటకం ప్రదర్శించారు. కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, చెరుకూరి సాంబశివరావు, నాంచారయ్యలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రదర్శించిన కిడ్నాప్ నాటిక ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుత సమాజంలో యువత స్వతంత్ర జీవితానికి అలవాటుపడి, జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరిచి విచ్చలవిడిగా తిరుగుతూ వ్యసనాలకు లోనైన వారికి కనువిప్పు కలిగించేలా చక్కని కథాంశంతో నాటకాన్ని ప్రదర్శించారు. చెరుకూరి సాంబశివరావు రచించి, దర్శకత్వం వహించి, నటించి అందరినీ మైమరపించారు. ఈ సందర్భంగా కళాభారతి అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు ప్రదర్శనలో మనవడు పాత్రధారి చిరంజీవి నటనను మెచ్చుకొని రూ.1,000 బహుమతిని ప్రకటించారు. ప్రేక్షకులందరూ చిరంజీవి నటనను అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



సంఘటనా స్థలం వద్ద ఎంవీపీ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



ఇంట్లో కాలిబూడిదైన సామగ్రి

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ సెక్టార్-3లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ సమీపంలో గల ఓ ఇంట్లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లో వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్నవారు బయటకు పరుగులు తీయడంతో ఎటువంటి ప్రాణహాని, గాయాలు కాలేదు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎంవీపీ సెక్టార్-3లోని ఓ గ్రూప్ హౌస్ రెండో ఫ్లోర్‌లో 1-79-1 నంబర్ ఇంటిని ప్రేయర్ హాల్‌గా నిర్వహిస్తున్నారు. గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆ ఇంట్లో మంటలు రేగాయి. ఇది గమనించిన కింద ఫ్లోర్‌లో ఉంటున్న ఇంటి యజమాని అగ్నిమాపక అధికారులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక వాహనంతో సిబ్బంది సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని మంటలు అదుపుచేశారు. ఆ సమయానికే ఆ హాల్లో ఉన్న ఫర్నిచర్, బొమ్మలు, సీలింగ్ తదితర వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఎంవీపీ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి జయమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రేయర్ హాల్ కావడం, ఆ సమయంలో అందులో ఎవ్వరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణహానీ జరగలేదని తెలిపారు.

పరీక్ష ఫీజు తగ్గించడంపై విద్యార్థుల హర్షం



ఏయూ వీసీ శశిభూషణరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు సెమిస్టర్ పరీక్ష ఫీజు తగ్గించడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావును కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

యూనివర్సిటీలో విద్యార్థులకు అనువైన వాతావరణాన్ని, అనుకూలమైన పరిస్థితులను కల్పించడంపై అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్

డాబాగార్డెన్స్: ఈ నెల 19 నుంచి 21వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సవం నిర్వాహక ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు విశాఖ బాలోత్సవం స్థానిక సెయింట్ ఆంథోనీ ప్రైమరీ పాఠశాలలో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే స్కూళ్లకు వెళ్లి పోటీల వివరాల సెట్లు అందజేశామన్నారు. ఈ నెల 9లోగా బాలోత్సవ కేంద్రంలో ఎంట్రీలు అందజేయాలని స్కూళ్ల యాజమాన్యాలను కోరినట్టు తెలిపారు. బాలోత్సవం విజయవంతం చేసేందుకు జీవీఎంసీ కమిషనర్ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశాఖ బాలోత్సవం అధ్యక్షుడు పి. రఘు, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యనారాయణ, పి. లచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి విశేష పూజలు



పూజలందుకున్న కాలబైరవుడు



కాలబైరవ స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఇక్కడ కొలువైన కాలభైరవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రకాష్ శాస్త్రి, సుబ్రహ్మణ్య శాస్త్రి, భాస్కర్ స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యల భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, కాళ్ల వరహాలు, మాజీ కార్యదర్శులు బోర ఎర్రాజీరెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, భక్తులు, అయ్యప్ప స్వామి మాలధారులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం





ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో నిర్మించిన అదనపు భవన సముదాయం

బీచ్‌రోడ్డు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెదవాల్తేరు మానసిక ఆస్పత్రిలో అదనంగా నిర్మించిన పిల్లలు, వృద్ధుల మానసిక చికిత్స విభాగం, పునరావాస విభాగం, వ్యసన విముక్తి విభాగాల భవనాలు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. నిజానికి ఈ భవన సముదాయం గత ప్రభుత్వంలోనే సిద్ధమైనప్పటికీ ఎన్నికల నియమవాళి రావడంతో ప్రారంభోత్సవం చేయలేకపోయారు. దీంతో నూతన కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం వీటిని ప్రారంభించే అవకాశముంది. జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం వస్తున్న ఆయన ఈ విభాగాలను కూడా ప్రారంభిస్తారనే సమాచారం మేరకు వీటిని ఆస్పత్రి అధికారులు సిద్ధం చేస్తున్నారు.

శివ పూజకు వేళాయె..

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- ముస్తాబైన శైవక్షేత్రాలు



కార్తీక మాస పూజలకు సిద్ధమైన కొత్త వెంకోజీపాలెం శివాలయం



కొత్త వెంకోజీపాలెం శివాలయంలో దీపాలు వదిలేందుకు ఏర్పాటు చేసిన కొలను

మద్దిలపాలెం: శివ భక్తులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసోత్సవాలకు వేళాయింది. శనివారం నుంచి మొదలయ్యే ఈ ఉత్సవాల్లో నెల రోజుల పాటు నియమనిష్టలతో శివుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ సందర్భంగా శివాలయాలన్నింటినీ నూతన రంగులు, హంగులతో ముస్తాబు చేశారు. కొత్తవెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట శివాలయాలతోపాటు ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. అధిక సంఖ్యలో తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.

సర్వం సిద్ధం

జీవీఎంసీ 15వ వార్డు కొత్తవెంకోజీపాలెంలోని శ్రీ రామానంద ఆశ్రమం దేవదాయ ధర్మాదాయ శాఖ శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో డిసెంబర్ 2 వరకు కార్తీక మాస పూజలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు మంగళధ్వని, అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పంచ పల్లవ సహిత పంచామృత నారికేళ అభిషేకాలతో కార్తీక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 6.30 గంటలకు ఆకాశజ్యోతి ప్రజ్వలన ధ్వజస్తంభ శిఖరాగ్ర భాగంలో ప్రారంభం చేయనున్నారు. నెల రోజుల పాటు ఆలయ ప్రధానార్చకుడు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఎ.రామకృష్ణ, పి.సుబ్రహ్మజేశ్వర శాస్త్రి, పి.బాలభాస్కర శర్మ, వి.లక్ష్మీనారాయణ శర్మ, సంతోష శర్మల అర్చక బృందం ఆలయ సముదాయంలోని శివాలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వినాయక, రాజరాజేశ్వరి, ఆంజనేయ స్వామి, నూతనంగా నిర్మితమైన అయ్యప్ప దేవాలయంలో విశేష అభిషేకాలు చేస్తారు.

ముఖ్యమైన పూజా కార్యక్రమాల వివరాలు

- శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ఈ నెల 4న మొదటి కార్తీక సోమవారం సందర్భంగా స్వామికి ప్రాతఃకాలం నుంచి అభిషేకార్చనలు జరుగుతాయి. ఉదయం 11 గంటలకు రుద్రాభిషేకాలు చేస్తారు.
- ఈ నెల 5న ఆలయ ఆవరణలోని పుట్ట వద్ద నాగులచవితి పూజలు నిర్వహిస్తారు.
- 6న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కొలువైన నాగేంద్రుడి వద్ద నాగపంచమి పూజలు జరుపుతారు.
- 12న కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామివారికి ప్రాతఃకాల, పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహిస్తారు.
- 13న తులసికోట వద్ద ఆవునేతితో దీపారాధనలు చేస్తారు.
- 15న కార్తీక పౌర్ణమి పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణ ఉత్సవం, కల్యాణ గౌరీ వ్రతాలు, మాస శివరాత్రి పూజలు, ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తారు.
- డిసెంబర్ 2న పోలి పాడ్యమిని పురస్కరించుకుని భక్తులు దీపాలు వదలటం, బ్రాహ్మణులకు భత్యం ఇవ్వడం, ఆలయ కొలనులో తెప్పోత్సవ కార్యక్రమాలతో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయని కొత్తవెంకోజీపాలెం శివాలయ అర్చకులు తెలియజేశారు.

ప్రతి రోజూ ఆలయానికి రావడం వీలుకాని భక్తులకు ప్రత్యేక టికెట్ సదుపాయం కల్పించామని చెప్పారు. కార్తీక మాస పూజలకు స్థానిక గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్తులు తమ సహాయ సహకారాలు అందించనున్నట్టు పేర్కొన్నారు.

ఎవరిదో ఈ వాహనం..?



పెదగదిలి వద్ద 20 రోజులుగా నిలిపి ఉన్న స్కూటీ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కూడలి అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఓ స్కూటీ నిలిపి ఉంది. ఇది ఎవరిదో తెలియదని స్థానికులు చెబుతున్నారు. సుమారు 20 రోజులుగా ఈ ద్విచక్ర వాహనం అక్కడే నిలిపి ఉందని, దాని కోసం ఎవ్వరూ రాలేదని అంటున్నారు. ఇక్కడ కొండవాలులో ఉన్న వారు ఎవరైనా పార్క్ చేశారేమోనని ఆరా తీసినా.. దీని యజమాని ఎవ్వరూ ముందుకు రాలేదని పేర్కొంటున్నారు. బయట ఎక్కడో దొంగిలించి ఇక్కడకు వచ్చేసరికి పెట్రోల్ అయిపోవడంతో విడిచిపెట్టేశారా.. లేదంటే ఇంకేమైనా జరిగిందా అంటూ స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవ పోలీసులు దీన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. స్కూటీ నంబర్ ప్లేట్‌పై 'ఏపీ05 డీఎస్ 9018' అని నంబర్ ఉంది. సుమారు ఐదేళ్లుగా ఏపీ 39 కామన్ నంబర్‌తో ఉంటున్నాయి. కొత్త వాహనంలా కనిపిస్తున్న దీనిపై నంబర్ మాత్రం ఏపీ05 ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు గోపూజ

ఆరిలోవ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలస్‌లో గోపూజ, గోవర్ధన పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 9 గంటల వరకు జరగనున్న ఈ పూజల్లో భక్తులు పాల్గొనాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదు రాజా దాస ప్రకటనలో కోరారు.

వల్లభాయ్ పటేల్‌కు అధికారుల నివాళి

మహారాణిపేట: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటం వద్ద కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్, ఏవో ఈశ్వరరావు, ఇతర అధికారులు, నివాళులర్పించారు.